సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 30 । జూన్ । 2024



ఎవరు.. ఎక్కడికి.. ఎందుకు?

పోలీసులు నిఘా వేస్తున్నారు. రాత్రి వేళ ఎవరు ఎటు వెళ్తున్నారో తెలుసుకుంటున్నారు.

- 8లో



పండ్లు తీసుకుని వస్తుండగా..

చిలకపాలెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మృతునిది శ్రీకాకుళం.

- 8లో

రేపు నిమ్మాడకు రవాణా మంత్రి రాక

కోటబొమ్మాళి: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి టి.చైతన్యకుమార్ సోమవారం టెక్కలి నియోజకవర్గం నిమ్మాడ రానున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమాచారం అందినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు రోడ్డుమార్గంలో చేరుకొని 10.30 వరకు నిమ్మాడలో జరగనున్న ఓ కార్యక్రమంలో పాల్గొంటారని, అనంతరం విశాఖపట్నం బయలుదేరి వెళ్తారని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

పలు పరీక్షల ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని పలు పరీక్ష ఫలితాలను శనివారం ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శనివారం విడుదల చేశారు. ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్, వర్సిటీ వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచారు. బీపీఈడీ మొదటి సెమిస్టర్‌లో 270 మందికి 250 (93.93 శాతం), డీపీఈడీ మొదటి సెమిస్టర్‌లో 47 మందికి 46 మంది (97.87 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంజినీరింగ్ ఎనిమిదో సెమిస్టర్‌లో సీఎస్ఈలో 66 మందికి 66, ఈసీఈలో 68 మందికి 68, మెకానికల్ ఇంజినీరింగ్‌లో 64 మందికి 62 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎల్ఎల్‌బీ ఐదేళ్ల న్యాయ విద్య 10వ సెమిస్టర్‌లో 18 మందికి 18 మంది, ఎల్ఎల్‌బీ మూడేళ్ల ఆరో సెమిస్టర్‌లో 111 మందికి 111 మంది ఉత్తీర్ణత సాధించారు. మార్కుల జాబితాలు కళాశాలల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. రీవాల్యుయేషన్ అవసరమనుకునే విద్యార్థులు 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

'మత్తు' వదలగొట్టాలి



ఏఐవైఎఫ్ నాయకుల ర్యాలీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో జరుగుతున్న మాదకద్రవ్యాల వ్యాపారాన్ని ముఖ్యంగా గంజాయి క్రయ విక్రయాలను అరికట్టాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని రామలక్ష్మణ కూడలి వద్ద మానవహారం చేపట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మొజ్జాడ యుగంధర్, కొన్న శ్రీనివాసరావులు మాట్లాడుతూ మత్తుపదార్థాలకు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకుంటున్న యువతను మేల్కొల్పాలన్నారు. జిల్లాలో గంజాయి వ్యాపారం పెద్ద ఎత్తున జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు వ్యవస్థ దృష్టిపెట్టాలని, పాఠశాలలు, కళాశాలల వద్ద తెలియని వ్యక్తులు చాక్లెట్ల రూపంలో మత్తుపదార్థాలను కలిపి విద్యార్థులకు ఇస్తున్నారన్నారు. వీటిపై అధికారులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు సాంబశివరాజు, కిశోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జూలై 10 నుంచి 14 వరకు ద్విశతావధానం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఈఓ చంద్రశేఖర్, ప్రధానార్చకులు శంకరశర్మ

అరసవల్లి: ప్రముఖ అవధాన విద్యా సరస్వతి డాక్టర్ బులుసు అపర్ణ ఆధ్వర్యంలో జూలై 10 నుంచి 14వ తేదీ వరకు ద్విశతావధాన కార్యక్రమాన్ని అరసవల్లి ఆలయ శ్రీవైజయంతి ఉత్సవ వేదికలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్, ప్రధానార్చకులు, శ్రీసుమిత్ర కళాసమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మలు సంయుక్తంగా తెలియజేశారు. ఈ మేరకు శనివారం ఉదయం అనివెట్టి మండపంలో ద్విశతావధాన కళా విలాసం కార్యక్రమ ఆహ్వాన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. అనంతరం శంకరశర్మ మాట్లాడుతూ శ్రీసూర్య నారాయణ స్వామి దేవస్థానం, శ్రీసుమిత్ర కళాసమితి సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, మొత్తం 216 మంది పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారని, జిల్లాలో తొలిసారిగా ఇలాంటి కార్యక్రమాన్ని భారీగా నిర్వహిస్తున్నామని వివరించారు. అలాగే కార్యక్రమం చివరి రోజు అంటే ఆదివారం సాయంత్రం విజయోత్సవ సభను కూడా నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమానికి ఆసక్తి గలవారు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



వారికి గౌరవ కస్టమర్.. గోమాతే

జిల్లా కేంద్రంలోని పెద్దమార్కెట్ వీధి. ఉదయం వెలుతురు రాగానే వరుసగా దుకాణాలన్నీ ఒక్కొక్కటిగా తెరుచుకుంటాయి. అన్ని దుకాణాలకు ప్రతి రోజూ తొలి కొనుగోలుదారుగా ఓ గోమాత వెళ్తుంది. వ్యాపారి అరటి పండో, ఆకు కూరో ఇస్తే పరమానందంగా ఆరగించి అక్కడి నుంచి వెనుదిరుగుతుంది. ఎప్పుడో ఓ సారి కాదు.. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ ఈ క్రతువు నడుస్తోంది. ఇప్పుడు వ్యాపారం చేస్తున్న వారి తండ్రుల హయాంలో కూడా ఇలాగే జరిగేది. ఉదయాన్నే గోమాతను అర్చించే మహత్తర అవకాశం తమకు దక్కిందని అక్కడి వ్యాపారులు మహదానందపడిపోతుంటారు.

– శ్రీకాకుళం కల్చరల్





ప్రతి రోజు మాషాపుకి వస్తుంది

మా షాపు వద్దకి ప్రతి రోజు ఓ గోమాత వస్తుంది. గోమాత కోసమే మేం అరటి పళ్లు ఉంచుతాం. అలాగే షాపులో దేవుడికి నైవేద్యంగా పెట్టిన వాటిని అందిస్తుంటాం.

– పట్నాల చంద్రశేఖర్, బ్యాగుల వ్యాపారి

మార్కెట్‌కు వెళ్లి అరటి పళ్లు తెస్తా..

నేను మార్కెట్‌కు ఉదయం వెళ్లి అక్కడి మాగిపోయిన అరటి పళ్లు గానీ, తోటకూర గానీ కొనుగోలు చేసి షాపు తెరుస్తాను. షాపు తెరవగానే నా వద్దకు గోమాత వస్తుంది. దానికి నేను వాటిని రోజు పెడుతుంటాను.

– సోమేశ్వరరావు, సాయినాథ్ గార్మెంట్స్

ఎన్నో ఏళ్లుగా అలవాటు

మా తండ్రి నుంచి ఈ అలవాటు కొనసాగుతోంది. ఆయన లేకపోయినా గోమాత మా షాపు వద్దకు వస్తుంది. రాగానే అరటి పళ్లు తినిపిస్తాను.

– పట్నాల రమణయ్య, డెకరేషన్ దుకాణం

పొంచి ఉన్న ముప్పు



- జిల్లాలో ఇప్పటికే పలు చోట్ల ప్రబలిన జ్వరాలు
- జూలై 1 నుంచి జిల్లా వ్యాప్తంగా వైద్య బృందం సర్వే

అరసవల్లి:

జల్లులు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తమవుతున్నారు. దోమల నివారణకు చర్యలకుగాను వైద్యారోగ్య శాఖతో పాటు పంచాయతీరాజ్, ప్రజారోగ్య శాఖలు కూడా సంయుక్తంగా కార్యాచరణను సిద్ధం చేస్తున్నాయి. మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడువాపు, కలుషిత నీరు, ఆహారంతో డయేరియా, టైఫాయిడ్, కామెర్లు వంటి వ్యాధులతో పాటు వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తతతో వ్యవహరించి, అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు.

దీనిపై డీఎంహెచ్ఓ డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ జిల్లాలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉన్నామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఇటీవలే కలుషిత ఆహారంతో విద్యార్థులకు వాంతులు, విరేచనాల లక్షణాలు కనిపిస్తే.. సుమారు 110 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. వీరు వినియోగించే



శాంతినగర్‌లో క్షీణించిన పారిశుద్ధ్యం

ఆహారం, మంచినీటిని కూడా టెస్టులకు పంపించామని, అలాగే డయేరియా తదితర జ్వరాల బారిన పడిన వారి కోసం జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. అన్ని గ్రామాల్లోనూ ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పిల బృందం ఇంటింటికీ వెళ్లి ప్రత్యేకంగా ఐదేళ్ల వయసున్న పిల్లల వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. డయేరియా లక్షణాల్లో భాగంగా విరేచనాలను నియంత్రించేందుకు ప్రతి పిల్లవాడికి ఓఆర్ఎస్ ప్యాకెట్, జింక్ మాత్రలను అందజేస్తామని చెప్పారు. ప్రతి పీహెచ్‌సీలో ఒక ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌తో పాటు జిల్లాకు చెందిన 10 మంది అధికారులతో కూడిన టీంను ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలూ పనిచేసేలా జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఒక కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ మీనాక్షి

రసాయన పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం



పైడిభీమవరం పారిశ్రామికవాడలో గల సరకా పరిశ్రమలో అగ్ని ప్రమాదంతో దట్టంగా వ్యాపించిన పొగలు

- తప్పిన ప్రాణనష్టం
- భయభ్రాంతులకు గురైన కార్మికులు, పరిసర ప్రాంత ప్రజలు

రణస్థలం: పైడిభీమవరం పారిశ్రామికవాడ నారువ పంచాయతీలో గల సరకా ల్యాబొరేటరీస్ పరిశ్రమలో శనివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. పరిశ్రమ ప్రతినిధులు, అగ్నిమాపక అధికారులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం 1 గంట సమయంలో కార్మికులంతా భోజనానికి దిగారు. ఆ సమయంలో క్యామ్ ప్రొడక్షన్ బ్లాక్‌లో టోలిన్ అనే రసాయనం రియాక్టర్‌లోనికి మార్చే క్రమంలో స్టాటిక్ ఎలక్ట్రిసిటీ సంభవించి మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న టోలిన్, ఎసిటోన్, హెచ్‌సీఎల్ వంటి రసాయనాల డ్రమ్ములకు మంటలు వ్యాపించడంతో తీవ్రమైన పొగలు అలముకున్నాయి. ఈ ఊహించని పరిణామంతో పరిశ్రమలో ఉన్న కార్మికులు బయటకు వచ్చి పరుగులు తీశారు. కొందరు కార్మికులు తెలియక నీటితో రసాయనాలు ఆపడంతో నల్లని దట్టమైన పొగలు వ్యాపించాయి. దీంతో కార్మికులంతా భయభ్రాంతులకు గురయ్యారు.

మొదట పైడిభీమవరం పారిశ్రామికవాడకు చెందిన సిస్కో అగ్నిమాపక శకటం వచ్చి ఫోమ్ సాయంతో మంటలను ఆర్పివేసింది. తర్వాత అరబిందో, రణస్థలం అగ్నిమాపక వాహనాలు పరిశ్రమకు చేరుకుని పూర్తి స్థాయిలో మంటలను అదుపు చేశాయి. జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహన్‌రావు, ఎస్ఐ పైల అశోక్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి తగు జాగ్రత్తలు చెప్పారు. ప్రమాదం విషయం తెలిసి పరిసర ప్రాంత ప్రజలు ఉలిక్కిపడ్డారు.

ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌లు పరిశ్రమను పరిశీలించారు. ఘటనలో ప్రాణహాని జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంతో పరిశ్రమకు సుమారు రూ.కోటికి పైగా ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని, ఇంకా పరిశ్రమ యాజమాన్యం పూర్తి స్థాయిలో వివరాలు ఇవ్వాల్సి ఉందని అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు.



ప్రమాద స్థలం

ఒక్క రోజులోనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ

- పాత పాస్ పుస్తకాల స్థానే రశీదులు
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీకి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కు తెలిపారు. ఏపీ సచివాలయం నుంచి శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీపై జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెంచిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రభుత్వం జూలై నుంచి పంపిణీ చేస్తున్నందున కార్యక్రమం సజావుగా జరిగేలా చూడాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. 1వ తేదీన ఉదయం 6 గంటలకే పంపిణీ కార్యక్రమం ప్రారంభించాలని సూచించారు. మొదటి రోజునే వంద శాతం పంపిణీ జరగాలన్నారు. 50 మంది లబ్ధిదారులకు ఒక అధికారిని కేటాయించామని, బయో మెట్రిక్ విధానం ద్వారా రూ.7 వేల నగదును లబ్ధిదారుకు అందించి వారి వద్ద నుంచి రశీదును పొందాలని సూచించారు. పాత పింఛన్ పుస్తకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని, అలా వినియోగిస్తే సంబంధిత ఎంపీడీఓపై చర్యలు తీసుకుంటామన్నారు. పింఛన్‌తో పాటు సీఎం లేఖను కూడా లబ్ధిదారులకు అందించాలని తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌కు, పంచాయతీ సెక్రటరీలకు పింఛన్ పంపిణీపై ఎంపీడీఓలు ప్రభుత్వ నిబంధనలను వివరించి అవగాహన కలిగించాలన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి కార్యక్రమం కావున ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ కింద జిల్లాలోని అన్ని విభాగాలకు సంబంధించి 3,19,702 మంది లబ్ధిదారులకు రూ.212.07 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయని కలెక్టర్ తెలిపారు. జూలై 1 న ఇంటి వద్దనే సచివాలయ ఉద్యోగులతో వంద శాతం పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు ముందుగా ప్రకటించిన అదనపు మొత్తం రూ.1000 చొప్పున రూ.3వేలు, జూలై నెల రూ.4వేలు కలిపి మొత్తంగా రూ.7000 జూలై 1న పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వీసీలో జిల్లా గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టు అధికారి కిరణ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వెంకటేశ్వరరావు, లీడ్ బ్యాంకు ప్రతినిధి శ్రీనివాసరావు, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఈవీఎం గోడౌన్ పరిశీలన

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల్లో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆయా ఈవీఎం యూనిట్స్‌ను స్ట్రాంగ్ రూమ్‌లలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా భద్రపరిచినట్లు కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవీఎం గోడౌన్ సందర్శించినట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు తిరిగి ఆయా యూనిట్స్ సురక్షితంగా ఈవీఎం గోడౌన్‌కు తరలించినట్లు చెప్పారు. వాటిని పార్లమెంటు, అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా వాటికి కేటాయించిన గదుల్లో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా గోడౌన్‌ను పరిశీలించామన్నారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డీటీ చక్రవర్తి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

ఐటీఐ రెండో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ శనివారం విడుదల చేశారు. మొదటి కౌన్సెలింగ్‌లో ఖాళీ సీట్లకు ఇప్పుడు ప్రవేశాలు కల్పిస్తారు. ఆసక్తి గల విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో జూలై 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తు అనంతరం డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తులు సమీప ప్రభుత్వ ఐటీఐల్లో వెరిఫికేషన్ చేసుకోవాలి. జూలై 25వ తేదీ లోపు వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నవారు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులు. దరఖాస్తుల స్వీకరణ, వెరిఫికేషన్ స్వీకరణ అనంతరం విద్యార్థుల మొబైల్‌కు కౌన్సెలింగ్ షెడ్యూల్ తెలియజేస్తారు. ప్రస్తుతం ప్రైవేట్ ఐటీఐల్లో మాత్రమే సీట్లు మిగిలి ఉన్నాయి. రెండో విడత కౌన్సెలింగ్‌కు సంబంధించి విద్యార్థులు ఆప్షన్లు ఇచ్చుకున్న ఐటీఐల్లో కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలు రెండింటికీ విద్యార్థులు ఆప్షన్లు ఇచ్చుకునే వెసులుబాటు కల్పిస్తారు. కౌన్సెలింగ్ షెడ్యూల్ సైతం విద్యార్థుల హాజరుకు వీలుగా తేదీలు కేటాయిస్తారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ 23 ఐటీఐల్లో 3608 సీట్లు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి 26వ తేదీ వరకు కౌన్సెలింగ్‌ను ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించారు. జిల్లా నుంచి 2470 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 826 ప్రవేశాలు జరిగాయి. 2782 సీట్లు జిల్లాలో ఖాళీగా ఉన్నాయి. ఏటా రెండో విడత కౌన్సెలింగ్‌లో ప్రైవేట్ సంస్థల్లో ప్రవేశాలు జరుగుతున్నాయి. దీంతో ఈ కౌన్సెలింగ్‌పై వారు ఆశలు పెట్టుకున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు రెండో విడత ఐటీఐ కౌన్సెలింగ్ సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు సైతం మళ్లీ చేసుకోవచ్చునని, గతంలో దరఖాస్తు చేసుకోని విద్యార్థులు సైతం చేసుకోవాలని సూచించారు. పారిశ్రామిక శిక్షణ కోర్సుతో తక్కువ వయస్సులో విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.

శ్రీకాకుళం జట్టు ఘన విజయం

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి అండర్-16 బాలుర క్రికెట్ టోర్నీలో శ్రీకాకుళం జట్టు మరో భారీ విజయాన్ని నమోదు చేసింది. విజయవాడలోని మంగళగిరి, నరసారావుపేట క్రీడా మైదానాల్లో జరుగుతున్న ఈ టోర్నీలో పశ్చిమగోదావరితో జరిగిన తన రెండో మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు ఇన్నింగ్స్ 244 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. జిల్లా జట్టులో అటు బ్యాటింగ్‌లో భాను ప్రకాష్‌నాయుడు, క్రాంతికుమార్, రోహిత్, నీహార్ రాణించగా, బౌలింగ్ రుత్విక్‌సాగర్, సాయివెంకట్ ప్రనీత్, నీహార్, హేమచంద్ర విజృంభించారు. ఆల్‌రౌండ్ ప్రతిభతో జిల్లా జట్టు రాణించింది.



ఆర్మీ జవాన్ దొరబాబును మెడల్‌తో సత్కరిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్

మన జవాన్ సాహసం

- పాకిస్తానీ ఉగ్రవాదులను అంతమొందించిన వీర జవాన్ బొడ్డు దొరబాబు
- స్పాట్ కమాండేషన్ మెడల్‌తో సత్కారం
- జవాన్ స్వగ్రామం మామిడిపల్లి



తోటి జవాన్లతో దొరబాబు (వృత్తంలో వ్యక్తి)

సోంపేట: మామిడిపల్లి పంచాయతీ చిన్న మామిడిపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బొడ్డు దొరబాబు వీరత్వం చూపించారు. శ్రీనగర్ బారాముల్లా జిల్లా, ఆదిపురా గ్రామంలో నిర్వహించిన 32 రాష్ట్రీయ రైఫిల్ ఆపరేషన్‌లో పాల్గొని, ఇద్దరు పాకిస్తానీ ఉగ్రవాదులను అంతమొందించారు. ఇంతటి సాహసం చూపి ఆర్మీ ఉన్నతాధికారుల నుంచి అత్యుత్తమ సత్కారాన్ని అందుకున్నారు. 32వ రాష్ట్రీయ రైఫిల్ ఆపరేషన్‌లో స్థానిక కాశ్మీర్ పోలీసులతో కలిసి పాల్గొన్న దొరబాబు.. డ్రోన్ సాయంతో ఉస్మాన్, ఉమర్ అనే ఇద్దరు పాకిస్తానీ ఉగ్రవాదుల ఆచూకీ తెలుసుకోవడమే కాకుండా 54 గంటల పాటు ప్రాణాలకు ఎదురొడ్డి పోరాటం చేసి వాళ్లను హతమార్చడంలో ప్రముఖ పాత్ర వహించాడు.

దొరబాబు తండ్రి బొడ్డు పురుషోత్తం సాధారణ రైతు. విజయవంతమైన ఈ ఆపరేషన్‌లో అతడి ధైర్యసాహసాలను మామిడిపల్లి గ్రామస్తులతోపాటు స్థానికులు ప్రశంసించారు.

క్లుప్తంగా

ఏపీఎంల సంఘ అధ్యక్షుడిగా సనపల



నూతన ఏపీఎంల కమిటీ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: జిల్లా సెర్ప్–డీఆర్డీఏ ఎల్–3 ఏపీఎం యూనియన్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఇచ్ఛాపురం ఏపీఎం సనపల ప్రసాదరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జిల్లా సమాఖ్య కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి ఏపీఎంల సంఘ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా జి.ప్రసాదరావు(మందస ఏపీఎం), కార్యదర్శిగా పి.కమల కుమారి(సరుబుజ్జిలి ఏపీఎం), సహాయ కార్యదర్శిగా జి.రాజారావు(పోలాకి ఏపీఎం), కోశాధికారిగా కె.గోవిందరావు(కవిటి ఏపీఎం) ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను ఏపీఎంలు అభినందించారు.

ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీఓ భరత్‌నాయక్

కాశీబుగ్గ: నూతనంగా ఏర్పాటైన పలాస రెవిన్యూ డివిజన్‌కు సంబంధించిన నూతన కార్యాలయం నిర్మాణానికి మార్గం సుగమమైంది. పలాస మండలం ఇంగిలిగాం రెవెన్యూ పరిధిలోని ప్రాంతంలో కార్యాలయం నిర్మించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పలాస ఆర్డీఓ భరత్ నాయక్ శనివారం స్థలపరిశీలన చేశారు. ఆయనతో పాటు పలాస తహశీల్దారు ఎస్ఎస్‌వీఎస్ నాయుడు, మండల సర్వేయర్ గిరిప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

వర్షానికి నేలకొరిగిన చెట్లు



తోటవాడ వద్ద రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లు

బూర్జ: మండలంలోని కొల్లివలసలో శనివారం కురిసిన భారీ వర్షానికి కొల్లివలస– తోటవాడ గ్రామాల మధ్య రహదారిని ఆనుకున్న ఉన్న వెదురు చెట్లు నేలకొరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇరువైపులా వాహనచోదకులు గంటల తరబడి నిరీక్షణ చేయాల్సి వచ్చింది.

రాష్ట్ర ఆడిటర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు



ఆమదాలవలస: రాష్ట్ర ఆడిటర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఆమదాలవలసకు చెందిన బుడుమూరు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన రాష్ట్ర అసోసియేషన్ ప్రమాణ స్వీకారం అనంతపురంలో ఆదివారం జరుగుతుందని పేర్కొన్నారు. అసోసియేషన్‌కు రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన దామన్నర్ల శ్రీనివాస్, కార్యదర్శిగా కె.వి కోటేశ్వరరావు, ట్రెజరర్‌గా శ్రీనివాసులు రెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఆదినారాయణ రెడ్డి, ఈసీ మెంబర్‌గా శ్రీకాకుళం కు చెందిన టీవీ శ్యాంసుందర్‌ని ఎన్నుకున్నట్లు తెలిపారు.

మరోసారి రాజీనామా డెడ్‌లైన్!

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రస్తుతం రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల్లో వైస్‌చాన్సలర్లు రాజీనామాలపై విస్తృత చర్చ కొనసాగుతోంది. వీసీలకు విద్యాశాఖ నుంచి డెడ్‌లైన్లు, హెచ్చరికలు వస్తున్నాయన్న సమాచారంతో సర్వత్రా గందరగోళం నెలకొంది. కొందరు శనివారం సాయంత్రంలోగా రాజీనామా చేయాలని విద్యాశాఖ నుంచి డెడ్‌లైన్ విధిస్తూ హెచ్చరికలు జారీ అయినట్లు తెలిసింది. ఇప్పటికే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన 10 మంది వీసీలు రాజీనామా చేశారు. తాజాగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీకి సైతం హెచ్చరికలు వచ్చినట్లు సమాచారం. జనవరి 18న వీసీగా రజిని బాధ్యతలు స్వీకరించారు. ఆరు నెలలు సైతం పదవీకాలం పూర్తికాకపోవడం, పాలనలో ఎటువంటి ఆరోపణలు రాకపోయినా హెచ్చరికలు జారీ చేయడాన్ని పలువురు తప్పుపడుతున్నారు.

ఎవరు..ఎక్కడికి..ఎందుకు?

- రాత్రివేళ సంచరిస్తున్న వారిని ఆరా తీస్తున్న పోలీసులు
- చోరీలకు అడ్డుకట్ట వేసేలా ప్రణాళికలు
- నైట్ బీట్ బృందాలను పెంచే యోచన
- ఇప్పటికే 17 బృందాలతో విధులు



విధుల్లో భాగంగా రికార్డులను సరిచూస్తున్న సీఐ సన్యాసినాయుడు

శ్రీకాకుళం క్రైమ్ : రాత్రిపూట చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. కొన్నాళ్లుగా జిల్లాలో పలుచోట్ల చోరీలు జరుగుతుండటంతో ముందస్తు చర్యల్లో భాగంగా శ్రీకాకుళం నగరంలో నైట్ బీట్ బృందాలను మరింత పెంచే యోచనలో ఉన్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక పటిష్ట నిఘాతో చోరీలకు బ్రేక్ వేయాలంటూ ఆదేశాలు జారీ చేయడంతో శ్రీకాకుళం ఒకటో పట్టణ, రెండో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు లెంక సన్యాసినాయుడు, గుండుమోను ఉమామహేశ్వరరావులు ప్రత్యేక దృష్టి సారించారు. రోజు తప్పించి రోజు నైట్ రౌండ్ బీటుల్లో సిబ్బందితో సహా పాల్గొంటున్నారు. గతంలో 17 నైట్ బీట్ బృందాలు విధులు నిర్వరించగా ఇప్పుడు అదనంగా మరో నాలుగు బృందాలను పెంచే యోచనలో ఉన్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. శుక్రవారం రాత్రి ఒకటో పట్టణ సీఐ లెంక సన్యాసినాయుడు నగరంలోని పలు వ్యాపార సముదాయాలు, లాడ్జీలు, దేవాలయాలు, బ్యాంకుల ఏటీఎం సెంటర్లు, ఆర్టీసీ కాంప్లెక్సుల వద్దకు వెళ్లి తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా ప్రయాణాలకు వెళ్లినప్పుడు ఇంటి మెయిన్ డోర్‌లకు తాళాలు వేయడమే కాక గేట్లకు కూడా వేయాలని సూచిస్తున్నారు. ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలు, నగదు, భూముల డాక్యుమెంట్లు, ఇతరత్రా విలువైన వస్తువులు బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని, లేదంటే వెంట తీసుకెళ్లాలని చెబుతున్నారు. బీరువా తాళాలు దిండులు, మంచం పరుపుల కింద ఉంచరాదని, అపార్ట్‌మెంట్లు, షాపింగ్‌మాళ్లవారు ఖచ్చితంగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచిస్తున్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను వినియోగించుకోవాలని కోరుతున్నారు. అపరిచిత వ్యక్తులు తారసడినా పోలీసులకు సమాచారమందించాలని, లేదంటే 100కు డయల్ చేయాలని స్పష్టం చేస్తున్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



ఉద్యోగ విమరణ చేసిన సిబ్బందితో ఎస్పీ, అదనపు ఎస్పీలు

శ్రీకాకుళం క్రైమ్: పోలీసులుగా ప్రజలకు మనం అందించిన సేవలే గుర్తింపునిస్తాయని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. జూన్ 30న ఉద్యోగ విరమణ చేయనున్న పోలీసు అధికారులు, సిబ్బందిని శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందేవారిలో ఎస్ఐలు ఎస్.కర్రయ్య, కె.మోహనరావు (పోలీస్ కంట్రోల్ రూం), ఎన్.ఎస్.పాణిగ్రాహి (ఏఆర్ ఎస్ఐ), పి.ఢిల్లీశ్వరరావు (ట్రాఫిక్ పీఎస్), ఏఎస్ఐ బి.నాగభూషణరావు (సీసీఎస్), హెచ్‌సీ బి.సంతోష్ (ఏఆర్), క్లాస్–4 ఉద్యోగి టి.రామారావు ఉన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ప్రేమ్‌కాజల్, ఉమామహేశ్వరరావు, డీఎస్పీలు త్రినాథరావు, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

పండ్లు తీసుకొని వస్తుండగా..

- లారీని ఓవర్ టేక్ చేయబోయి ఢీకొట్టిన వ్యాన్
- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



చైతన్యను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న దృశ్యం



నుజ్జయిన వ్యాన్ ముందుభాగం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలో జాతీయ రహదారి ఫ్లై ఓవర్‌పై శనివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా, మరొకరు స్వల్ప గాయాలతో బయిటపడ్డారు. శ్రీకాకుళం నుంచి వ్యాపారం నిమిత్తం పండ్లు కొనేందుకు ఇద్దరు వ్యక్తులు టాటా వింట్రా వ్యాన్‌పై తుని వెళ్లారు. శ్రీకాకుళం పట్టణం వచ్చే క్రమంలో చిలకపాలెం ఫ్లై ఓవర్ సమీపంలో ముందు వెళుతున్న లారీని ఓవర్ టేక్ చేయబోయి వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో వాడపల్లి చైతన్య (25) వ్యాన్ క్యాబిన్‌లో చిక్కుకున్నాడు. డ్రైవర్ పాదిలా షణ్ముఖరావు స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే సమాచారం ఇవ్వడంతో హైవే పెట్రోలింగ్ పోలీసులు, శ్రీకాకుళం అగ్నిమాపక శాఖ సిబ్బంది, హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అతి కష్టమ్మీద క్యాబిన్‌లో ఇరుక్కున్న వ్యక్తిని బయటకు తీశారు. శరీరం మొత్తం గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స నిర్వహించి 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. చికిత్స ప్రారంభించిన కొద్దిసేపటికే చైతన్య మృతి చెందాడు. మృతునిది శ్రీకాకుళం పట్టణం. రోజు కూలీగా, పండ్ల వ్యాపారంలో సహాయకుడిగా జీవనం సాగిస్తున్నాడు. వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. మరోవైపు వ్యాన్ ఢీకొట్టిన లారీ ఆపకుండా వెళ్లిపోయింది. అయితే నంబర్ ప్లేట్ రోడ్డుపై పడటంతో తెలంగాణ రిజిస్ట్రేషన్ వాహనంగా గుర్తించారు. వాహనం ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీఐఎస్ఎఫ్ జవాన్‌కు నివాళులు





అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్లో) ప్రసాద్ (ఫైల్)

ఎల్.ఎన్.పేట: మండలంలోని ముంగెన్నపాడు గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ జవాన్ యారబాటి ప్రసాద్ (34) అనారోగ్యంతో శుక్రవారం చెన్నైలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు శనివారం స్థానిక విలేకర్లకు తెలిపారు. ప్రసాద్ చెన్నైలో సీఐఎస్ఎఫ్ జవాన్‌గా పనిచేస్తున్నారు. నాలుగు రోజుల కిందట అనారోగ్యానికి గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. ప్రసాద్‌కు భార్య శూన్య కుమారి, కుమార్తెలు ధామిని, అనుష్క ఉన్నారని సోదరుడు, మాజీ సర్పంచ్ యారబాటి రాంబాబు తెలిపారు. ప్రసాద్ మృతి పట్ల పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సంతాపం తెలియజేశారు.

వారసత్వ సంపదకు నిలయం శ్రీకాకుళం



రీజనల్ స్థాయి విజేత కావ్యను సత్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: సంస్కృతి వారసత్వ సంపదలు, కళాకారులకు శ్రీకాకుళం నిలయమని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. నగరంలోని ఎన్‌సీఎస్ స్కూల్‌లో శనివారం ఇంటాక్ సన్మానోత్సవ సభ నిర్వహించారు. ఇటీవల ఇంటాక్ నిర్వహించిన మై మాన్యుమెంట్ అనే అంశంపై జరిగిన చిత్రలేఖనం పోటీలలో ప్రాంతీయ స్థాయి ప్రథమ బహుమతిని ఎన్‌సీఎస్ విద్యార్థి పి.కావ్యకు, జిల్లా స్థాయి ప్రథమ బహుమతి పి.శ్రీకీర్తికి అందజేశారు. ఈ సందర్భంగా ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక వెలికి తీయడమే సంస్థ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథంనాయుడు, విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు, స్కూల్ డైరెక్టర్ శ్రీకాంత్, కో–కన్వీనర్ నటుకుల మోహన్, పూర్వపు కన్వీనర్ కె.వి.జె.రాధాప్రసాద్, సురంగి మోహనరావు, స్వీప్ సంస్థ అధినేత కొమ్ము రమణమూర్తి, తర్లాడ అప్పల నాయుడు, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు



ఆస్పత్రిలో చేరిన బాధితులు

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రెండు రోజుల వ్యవధిలో సుమారు 11 మందిపై దాడిచేసినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. శనివారం ఆదిఆంధ్ర వీధిలో ఉంటున్న దాలయ్య అనే వ్యక్తి వీధిలో నడిచివెళ్తుండగా కుక్క దాడిచేసింది. తీవ్ర గాయాలు కావడంతో బాధితుడిని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఎన్‌టీఆర్ కాలనీ, మండపాలం కాలనీ, పాతజాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తూ దాడిచేస్తుండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడికి గాయాలు



గాయపడిన జగన్

శ్రీకాకుళం క్రైమ్ : అరసవల్లి మిల్లు కూడలి సమీపంలో శనివారం వేకువఝామున జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. శ్యామ్‌పాలెం గ్రామానికి చెందిన జగన్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై వస్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయమై స్పృహ కోల్పోయాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న బాబ్జీ అనే ఆర్టీసీ ఉద్యోగి సపర్యలు చేశాడు. ఇంతలో జగన్‌కు కుటుంబసభ్యుల నుంచి ఫోన్ రావడంతో జరిగిన విషయాన్ని చెప్పాడు. కుటుంబసభ్యులు వచ్చి బాధితుడిని రిమ్స్‌కు వైతరలించారు.


ఆస్తి తగాదాలో మహిళలపై దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నీలమ్మ

వజ్రపుకొత్తూరు రూరల్: ఆస్తి తగాదా ఘటనలో ఇద్దరి మహిళలపై వారి కుటుంబ సభ్యులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన ఇచ్ఛాపురం మండలం గుళ్లలపాడులో శనివారం చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుళ్లలపాడు గ్రామానికి చెందిన వాసుదేవరావు మొదటి భార్య కుమార్తె అయిన మెళియాపుట్టి మండలం గోకన్నపురం గ్రామానికి చెందిన గుంట నీలమ్మకు 20 ఏళ్ల క్రితం తన కుటుంబ సభ్యుల మధ్య జరిగిన ఆస్తి పంపకాల్లో 45 సెంట్లు వాటాగా అందింది. అప్పటి నుంచి భూమిని సాగు చేస్తూ వచ్చింది.ఈ ఏడాది కుడా ఖరీఫ్ సాగులో భాగంగా శుక్రవారం విత్తనాలు వేస్తున్న నీలమ్మపై వజ్రపుకొత్తూరు మండలం గుళ్లలపాడు గ్రామానికి చెందిన వాసుదేవరావు రెండో భార్య కుమారుడు శిష్టి కృష్ణమూర్తి, భార్య శిష్టి పావని, కుమారుడు శిష్టి వంశిలు దాడి చేశారు. ఈ ఘటనలో నీలమ్మ తల, చేతిపై తీవ్ర గాయాలు కాగా కుమార్తె అరుణకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర ఉషూ పోటీల్లో పతకాల పంట



పతకాలు సాధించిన ఉషూ క్రీడాకారులతో రెడ్డి శివకుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి జూనియర్ ఉషూ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. రాజమండ్రి వేదికగా ఈ నెల 27, 28 తేదీల్లో 10వ ఏపీ రాష్ట్రస్థాయి ఉషూ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు మొత్తం ఏడు పతకాలతో సత్తాచాటారు. ఇందులో 6 బంగారు, ఒక కాంస్య పతకం ఉన్నాయి. పతకాలు సాధించిన క్రీడాకారులను ఉషూ సంఘ ప్రతినిధులు అభినందించారు.

ప్రజల పక్షాన పోరాడుదాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాలేదని అభిమానులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని, ఐదేళ్ల పాటు ప్రజల పక్షాన ఉంటూ పోరాడదామని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. శనివారం ఇచ్ఛాపురం ఎంపీపీ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు రైతు భరోసా, మత్స్యకార భరోసా అందివ్వలేదన్నారు. హామీని తుంగలోకి తొక్కి వలంటీర్ల వ్యవస్థను ఎత్తివేసేందుకు పన్నాగం పన్నుతోందని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన వసతి దీవెన, విద్యా దీవెన, అమ్మ ఒడి, చేయూత, రైతు భరోసా పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపీపీ బోర పుష్ప, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, మాజీ ఎంపీపీ నర్తు చామంతి, పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, పిలక సంతు, పిట్ట మామయ్యరెడ్డి, ఆశి కృష్ణారెడ్డి, దుక్క ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న విశాఖపట్నం సిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ శైలజ. పక్కనే ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : భారతీయ నూతన చట్టాలు జూలై ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్న నేపథ్యంలో కొత్త చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు అధికారులకు సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులకు నూతన చట్టాలపై విశాఖపట్నం సిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ ఎం.శైలజ అవగాహన కల్పించారు. జూలై 1 నుంచి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్ 2023), భారతీయ నాగరిక్ సురక్ష సంహితా (బీఎన్ఎస్ఎస్ 2023), భారతీయ సాక్ష్యా అధినియం (బీఎస్ఏ) అనే కొత్త చట్టాలు అమల్లోకి రానున్నాయన్నారు. వీటిపై పోలీసు అధికారులకు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కొత్త, పాత చట్టాలలో మార్పులు, చేర్పులను క్షుణ్ణంగా వివరించి సందేహాలను నివృత్తి చేశారు. కొత్త చట్టాలు అమలు జరిగిన వెంటనే ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన పెంచుకుని బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. ఏయే సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, అరెస్టు, వాంగ్మూలం, నమోదు, దర్యాప్తులో పాటించాల్సిన జాగ్రత్తలు, చార్జిషీటు ఎలా తయారు చేయాలి, కేసుల ట్రయల్ సమయంలో దర్యాప్తు అధికారులు శిక్షల శాతం పెరిగేలా వ్యవహరించాల్సిన తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలు వివరించారు.

నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణా పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థంగా సేవలందించేందుకు వీలుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, డీఎస్పీలు వై.శృతి, శివరామిరెడ్డి, శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా



లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేయడం రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శనివారం జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు కేసులు రాజీ చేశారు. రాజీ ద్వారా ఇరు పార్టీలకు న్యాయం జరుగుతుందని, దీని ద్వారా వారి మధ్య ఎలాంటి కలహాలు, మనస్పర్థలు ఉండవని తెలిపారు. శనివారం సివిల్ కేసులు 143, క్రిమినల్ కేసులు 1061, పీఎల్‌సీ కేసులు 77 రాజీ అయ్యాయి. మొత్తము సొమ్ము రూ. 9,13,68,510 అందజేశారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గల న్యాయమూర్తులు పి.భాస్కర రావు, 3 వ అదనపు జిల్లా జడ్జి, కేవీఎల్ హిమబిందు, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, సివిల్ జడ్జి కె.శారదాంబ, సివిల్ జడ్జి, మోహిదిన్ జామరూత్ బేగం కమలుదీన్, ఎజెఎఫ్‌సిఎం జడ్జి డి.శ్రీభరణి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జడ్జి, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు .

జాబ్‌మేళాలో 83 మంది ఎంపిక



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్ర

శ్రీకాకుళం న్యూకాలనీ: విలువైన కాలాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు సూచించారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నోడల్ రిసోర్స్ సెంటర్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం కళాశాల సెమినార్ హాల్‌లో జాబ్ మేళా నిర్వహించారు. వివిధ డిగ్రీ కళాశాలలతో పాటు జిల్లా నలుమూలల నుంచి 520 మంది యువతీ యువకులు హాజరయ్యారు. అపోలో, పేటీఎం, నవత ట్రాన్స్‌పోర్ట్, ముథుట్ తదితర సంస్థల్లో ఉద్యోగాలకు అర్హులైన 83 మందిని ఎంపికచేశారు. కార్యక్రమంలో కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ ఐ.శ్రీలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, అకడమిక్ కోఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, రాంప్రసాద్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.